


**ఎన్నికల నియమావళిని సులభంగా తీసుకోవద్దు**

మెయిన్‌లో...


# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

గురువారం | 16 మే, 2024 | పేజీలు : 2


# పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమిదే విజయం

### మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి



**ప్రజాపక్షం / మిర్యాలగూడ :** పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలో ఇండియా కూటమి, తెలంగాణాలో కాంగ్రెస్ అభ్యర్థులు అత్యధిక స్థానాలు గెలుస్తారని మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో జానారెడ్డి మాట్లాడారు. దేశంలో ఇండియా కూటమి, రాష్ట్రంలో కాంగ్రెస్ అత్యధిక స్థానాలు, నల్లగొండ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గెలుస్తారని అన్నారు. ఏ పార్టీలో ఉన్న టికెట్, పదువులు అడగలేదని, ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి తనకు అవకాశాన్ని అన్ని పార్టీలు కల్పించాయన్నారు. తాను కేంద్ర మంత్రి, గవర్నర్, సీఎం, రాజ్యసభ సభ్యత్వం ఆశించడం లేదని ఇప్పటికే తన కుమారుడు ఎమ్మెల్యే అయ్యారని, మరో కుమారుడు ఎంపి అవుతారని చాలన్నారు. బీఆర్ఎస్ చేసిన తప్పదాల వల్ల ప్రజల్లో ఆదరణ కోల్పోయిందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేసిన కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఏఐఎఫ్‌బీ, టీజేఎస్, ఆప్, లోక్‌సత్తా కార్యకర్తలకు, నాయకులకు, ప్రజాప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మాధవి, నాయకులు గాయం ఉపేందర్‌రెడ్డి, వంగాల నిరంజన్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, జలందర్ రెడ్డి, అర్జున్, రామలింగయ్య, చిలుకూరు బాలు, తలకొప్పుల సైదులు, శ్రీనివాస్, బక్కా రెడ్డి, గౌస్, లలిత తదితరులు పాల్గొన్నారు.

# ఆఫర్ వచ్చినా.. తలవంచలే

### ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న



**ప్రజాపక్షం/ఆలేరు :** పది సంవత్సరాల నుంచి మాజీ సీఎం కెసిఆర్ చేస్తున్న అరాచకాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ బండారం బట్టబయలు చేసినందుకు వారి అనుచరులు ఎన్ని ఆఫర్లు ఇచ్చినా తలవంచలేదని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అన్నారు. బుధవారం ఆలేరు నియోజకవర్గ విస్తృత సమావేశం పార్టీ జిల్లా అధ్యక్షులు అండం సంజీవరెడ్డి నిర్వహించగా సమావేశానికి వారు హాజరై మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గం ఓ గొప్ప గడ్డ మహనీయులను అందించిన ప్రాంతం ప్రజల కోసం ప్రజల సంక్షేమం కోసం త్యాగం చేసిన వ్యక్తి ఆలేరు ముద్దుబిడ్డ ఐలయ్య అన్నారు. మనం ఎన్నికల్లో భాగంగా గ్రాడ్యుయేషన్ దగ్గరికి వెళ్ళినప్పుడు ఎందుకు వేయాలి అని అడిగితే మన హక్కుల కోసం మా ఆస్తుల కోసం పోరాడిన వ్యక్తి తీన్మార్ మల్లన్న అని చెప్పాలని కోరారు. ప్రతీనెల ఒకటవ తేదీన ఉద్యోగుల జీతాలు ఇచ్చి వాళ్ళ ఆత్మ గౌరవాన్ని నిలబెట్టిన ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అన్నారు. ఆగస్టు 15 తర్వాత రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయబోతుందని దానితోపాటు రైతుల కాళ్లు కడగబోతుందన్నారు. ఆలేరు నియోజకవర్గంలో 10,500 ఓట్లు ఉండగా తన స్వంత నియోజకవర్గము కాబట్టి పదివేల ఓట్లు కచ్చితంగా పడాలని కోరారు. ఆలేరు ఎమ్మెల్యే ఐలయ్య మాట్లాడుతూ మన అందరి హక్కుల కోసం కొట్లాడిన బిడ్డ తీన్మార్ మల్లన్న అందుకు వారికి ఓటు వెయ్యాలని తెలిపారు. మన అందరి కోసం వందల రోజులు జైల్లో ఉన్న వ్యక్తి అన్నారు. నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఈ ప్రాంత బిడ్డ కావడం గొప్ప అన్నారు. ఈ ప్రాంత బిడ్డ ప్రశ్నించే గొంతు పోరాట పటిమగల నాయకుడు మల్లన్నకు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి జనగామ ఉపేందర్ రెడ్డి, బ్లాక్ జిల్లా అధ్యక్షులు ఈరసారపు యాదగిరి, మహిళా జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ వెంకటస్వామి, గుట్ట ఎంపీపీ చీర శ్రీశైలం, ఆలేరు ఎంపీపీ అశోక్, ఆత్మకూరు జెడ్పీటిసి నరేంద్ర గుప్తా, ఎంపీపీ మంగమ్మ, మండల పార్టీ అధ్యక్షులు కానుగు బాలరాజు గౌడ్, వెంకటేశ్వరరాజు, సంజీవరెడ్డి, మహేందర్, లక్ష్మారెడ్డి, మాజీ జెడ్పీటీసీలు, ఎంపీపీలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు బరిలో 52 మంది అభ్యర్థులు



మెయిన్‌లో...

# రహదారిపై రైతుల రాస్తారోకో



**ప్రజాపక్షం/బీబీనగర్ :** కొనుగోలు కేంద్రాలలో నిలిచిపోయిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు భాషబోయిన బాల ప్రసాద్ రైతులు గూడూరు మాధవరెడ్డి యాదవ రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ రహదారి 163 పై బుధవారం రైతులు పండించిన ధాన్యాన్ని తగల బెట్టి రాస్తారోకో నిర్వహించారు. దీంతో జాతీయ రహదారిపై హైదరాబాదు నుండి వరంగల్ వెళ్లే వాహనాలు సుమారు గంటసేపు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వెంటనే సమాచారం తెలుసుకున్న తహసిల్దార్ శ్రీధర్ రాస్తారోకో వద్దకు చేరుకొని వెంటనే ధాన్యం కొనుగోలు చేసి రైతులకు ఇబ్బంది కలగకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.



## బంగారు గొలుసు చోరీ

ప్రజాపక్షం/చందూరు : చందూరు మున్సిపాలిటీ లోని 2 వార్డు సర్దార్ కాలనీలో మాదగోని ప్రతాప్ తండ్రి పెద్దులు కు చెందిన 3 తులాల బంగారు గొలుసు అపహరణకు గురైంది. ప్రతాప్ కుటుంబ సభ్యులు గత రాత్రి ఇంటి తులుపులకు గడియ పెట్టకుండ ఇంటి ముందుర నిద్రపోయారు. ప్రతాప్ రోజు మాదిరిగానే తన మెడలోని 3 తులాల బంగారు గొలుసును సెల్ఫులో పెట్టాడు. ఇది గమనించిన గుర్తు తెలియని వారు ఇంట్లోకి ప్రవేశించి 3 తులాల బంగారు గొలుసుతో పాటు తన అంగి జేబులో ఉన్న కొద్దిపాటి డబ్బులను కూడ తీసుకెళ్లారని ప్రతాప్ చందూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రతాప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సురేష్ కుమార్ అనుమానితులపై ఆరా తీస్తున్నారు.

## ప్రజాచైతన్య బావుటా పొలిశెట్టి



ప్రజాపక్షం/వేములపల్లి : పోలిశెట్టి లింగయ్య ప్రజా చైతన్య బావుట అని మిర్యాలగూడ డిపో మేనేజర్ బోల్లెద్దు పాల్ అన్నారు. గురువారం పోలి శెట్టి లింగయ్య 12వ వర్ధంతి సందర్భంగా సల్కునూరు అడ్డరోడ్డులో ఉన్న ఆయన స్మారక స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలిశెట్టి లింగయ్య గొప్ప గొప్ప పాటలను అందించిన ప్రజాకవి అని గుర్తు చేశారు. అనేక సినిమాలకు పాటలను అందించిన గొప్ప కవి గాయకులు అని కొనియాడారు. అంతేకాకుండా ఆయన ఈ సమాజానికి అందించిన పాటలను గుర్తు చేశారు. నివాళులర్పించిన వారిలో కందుకూరి సుదర్శన్ నర్సింగోజు రవి నకిరేకంటి కిరణ్ కుమార్ బాలు నాయక్ ప్రతాప్ బచ్చలకూరి శ్రీనివాస్ నాగిళ్ళ కొండల్ శోభన్ బాబు మధు తదితరులు ఉన్నారు.

## ఎంఎల్ఏ ఐలయ్యకు సన్మానం



ప్రజాపక్షం/ఆలేరు : ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను ఆలేరు కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం వారి నివాసంలో మర్యాదపూర్వక కలిసి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముదిగొండ శ్రీకాంత్, ఆలేటి అనిల్, మాజీ సర్పంచ్ కూల నరసింహులు, నాయకులు జూకంటి రమేష్, కాంతి మధు, కర్రే అజయ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌డిఓపై చర్యలు తీసుకోవాలి

ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగినందుకు ఉపాధ్యాయులపై పోలీసులతో లాఠీఛార్జీ చేయించిన నారాయణఖేడ్ ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌టియూఎఫ్ మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి,రామకృష్ణులు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలు పాటించకుండా ప్రశ్నించిన ఉపాధ్యాయులపై దౌర్జన్యం చేసిన ఆర్డీవో, పోలీసులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# ఉపాధ్యాయులపై లాఠీచార్జీ.. అమానుషం

ప్రజాపక్షం/కోదాడ : పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వహించిన ఉద్యోగ ఉపాధ్యాయులపై నారాయణఖేడ్ ఆర్డీవో పోలీసుల చేత లాఠీఛార్జి చేయించడం పట్ల టిఎస్ యూటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎన్.నాగేశ్వరరావులు బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. జీవో 61 ప్రకారం పిఓలకు రోజుకు రూ.600, ఓపిఓలకు రూ.400లు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను తుంగలోతొక్కి సహాయ రిటర్నింగ్ అధికారులు రెమ్యూనరేషన్ చెల్లింపులో కోతలు విధించడం అన్యాయమన్నారు. జీవో ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తే పోలీసుల చేత కొట్టించడం అప్రజాస్వామ్యం అన్నారు. లాఠీఛార్జి చేయించిన నారాయణఖేడ్ ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో టిఎస్ యూటిఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామన్నారు.

## లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించాలి

ప్రజాపక్షం/భువనగిరిరూరల్ : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని సింగన్నగూడెం వద్ద 2015లో శంకుస్థాపన చేసి నిర్మించిన 565 డబల్ బెడ్ రూమ్‌లను వెంటనే లబ్ధిదారులకు కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం డి జహంగీర్ డిమాండ్ చేశారు. బుధవారం సింగన్నగూడెం లోని డబల్ బెడ్ రూమ్ లను పరిశీలించి పనుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వము ఎమ్మెల్యేలు ఈ విషయంపై స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.



ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి పాండు సిపిఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ, మండల కార్యదర్శి దయ్యాల నరసింహ, నాయకులు బందెల ఎల్లయ్య, అన్నంపట్ల కృష్ణ, చింతల శివ పాల్గొన్నారు.

## ఎంఎల్‌సి ఎన్నికల సన్నాహక సమావేశంను విజయవంతం చేయాలి



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి : నేడు దేవరకొండలోని పిపిఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగే ఎంఎల్‌సి పట్టభద్రుల ఎన్నికల సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డిలు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఎంఎల్‌సి సన్నాహక సమావేశంకు నల్గొండ, ఖమ్మం, వరంగల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న వస్తున్నారని, మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, మల్లన్నను బలపరిచిన వివిధ ప్రజా సంఘాల నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు ఈ సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## సమాజసేవలో ఎల్లప్పుడు అండగా యశోద ఫౌండేషన్



ప్రజాపక్షం/మునగాల : సమాజ సేవలో యశోద ఫౌండేషన్ ప్రజలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నరాల రుక్మారావు అన్నారు. బుధవారం మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన నూకమల్ల అక్కమ్మరాములు కుటుంబానికి నిత్యవసర సరుకులతో పాటు నగదును అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూకమల్ల అక్కమ్మరాములు కుటుంబం ఎంతో దీనస్థితిలో ఉండటంతో వారు జీవించడానికి డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకుని నిత్యవసర సరుకులు అందచేశామన్నారు. పొలిశెట్టి నవీన్‌కుమార్ బియ్యం, నగదును చల్లా గురవయ్యలు అందచేశారని,పలువురి దాతలతో మాట్లాడి కొంతమేర సహాయం చేసేందుకు యశోద ఫౌండేషన్ ముందు ఉంటుందన్నారు. కార్యక్రమంలో యశోద ఫౌండేషన్ సభ్యులు ఒరుగంటి రవి, చల్ల గురవయ్య, ఆర్ఎంపి గోలి పూర్ణ శంకర్,కుమ్మరి వెంకన్న,బాలబోయిన ఉపేందర్,బోనాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఇటుకబట్టీలను తొలగించాలి



ప్రజాపక్షం / మిర్యాలగూడ : మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లో ఉన్న ఇటుకబట్టీలను తొలగించి తమ ఇబ్బందులను తొలగించాలని గ్రామస్థులు బుధవారం ఆర్డీవో శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ తమ గ్రామంలోని డబుల్‌బెడ్‌రూమ్ కాలనీలోకి వెళ్లే బాటను ఇటుకబట్టీల యాజమాన్యం ఆక్రమించుకోవడంతో కాలనీలోకి రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇటుకబట్టీల వల్ల ఇండ్లలోకి దుమ్ము, ధూళి చేరి ఆహారంపై, తాగునీటిపై పడుతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇటుకబట్టీలను తొలగించి నిర్వాహకులపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని లేనట్లయితే గ్రామం నుంచి పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించిన నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ముడావత్ జగన్, వీరన్న, మోహన్, తరుణ్, జావిద్, నుమాన్ తదితరులు పాల్గొన్నారు.

## 19న మిర్యాలగూడలో జల్సా



ప్రజాపక్షం / మిర్యాలగూడ : ఈనెల 19న మిర్యాలగూడలో ఉస్మానియా మసీద్‌లో మౌలానా అతికుల్ రెహమాన్ ఆధ్వర్యంలో అజీమిస్ షాన్ జల్సా నిర్వహిస్తున్నట్లు మిర్యాలగూడ ముస్లీం మత పెద్దలు హాఫీజోద్దీన్‌పాషా, అహ్మద్‌చావుష్‌లు తెలిపారు. బుధవారం స్థానిక ఉస్మానియా మసీద్‌లో జల్సా పోస్టర్‌ను ఆవిష్కరించి వారు మాట్లాడారు. ఈ జల్సాకు గుజరాత్‌కు చెందిన మత పెద్దలు మౌలానా సలావుద్దీన్ సైఫీ హాజరవుతున్నట్లు తెలిపారు. 19న సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 10గంటల వరకు ఈ జల్సా కొనసాగుతుందన్నారు. జిల్లాలోని పలు పరిసర ప్రాంతాల నుంచి ముస్లీం సోదర, సోదరీమణులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎండి.ఇస్మాయిల్, అంజాద్‌బాబా, తౌఫిక్, రఫీక్, అబ్దుల్‌మన్నాన్, పాషా, షఫి, సాదిక్, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లన్నను గెలిపించండి

ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు ఓటు వేసి గెలిపించాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బర్రె నరేష్ ఒక ప్రకటనతో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన, మన హక్కుల కోసం పోరాడిన వ్యక్తి మల్లన్నను గెలిపించాలన్నారు. ఈ ప్రాంత బిడ్డ, ప్రశ్నించే గొంతు ఎన్నికల్లో నిలబడిన మల్లన్నను గెలిపించాలని కోరారు.

## మానసిక వికలాంగుల ఆశ్రమానికి బియ్యం వితరణ



ప్రజాపక్షం/ రామన్నపేట : మండలంలోని కక్కిరేణి గ్రామంలో కన్‌స్ట్రక్షన్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో బుధవారం అక్షర కిరణం నార్కట్‌పల్లి ఆశ్రమానికి ఐదు క్వింటాళ్ల బియ్యాన్ని అనాథ ఆశ్రమానికి వితరణగా అందించారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త వేముల సైదులు మాట్లాడుతూ ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడమే నిజమైన దైవమన్నారు. సిఐడిసి కక్కిరేణి టైలరింగ్ సెంటర్‌లో ఉన్న మహిళల సహకారంతో అనాథల ఆకలి తీర్చడం కోసం కృషి చేస్తున్న వారి సేవలు అభినందనీయమ్మారు. కార్యక్రమంలో అక్షర కిరణం కోఆర్డినేటర్ మేదరి కిరణ్‌కుమార్, సిఐడిసి ఇన్స్‌పెక్టర్ మెట్టు మధు, టైలరింగ్ డెమో కన్నెబోయిన నవ్య, అనంతల విజయలక్ష్మి, కనకమ్మ, భార్గవి, పుష్పమ్మ, నర్మద, కావ్య, సైదమ్మ, పారిజాత, భారతమ్మ, వరలక్ష్మి, రాధా, సంతోష, అనిత, సంధ్య, మమత, అనసూర్య తదితరులు పాల్గొన్నారు.

## ఔదార్యం చాటుకున్న అంబేద్కర్ యూత్



ప్రజాపక్షం/వేములపల్లి : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరు వ్యక్తుల చికిత్స కోసం అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు రెమడాల సతీష్ 30 వేల రూపాయల ఆర్థిక సాయం అందచేశారు. మండలంలోని మొల్కపట్నం గ్రామానికి చెందిన జరిపోతుల సతీష్ గత కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలైన విషయం తెలుసుకున్న అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు రేమడాల సతీష్ కమిటీ సభ్యులతో కలిసి చికిత్స నిమిత్తం 25 వేల రూపాయలు అదే గ్రామానికి చెందిన రెమడాల బిక్షం కు 5000 రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ కమిటీ ప్రధాన కార్యదర్శి వలమల్ల పరమేష్, ఉపాధ్యక్షుడు పుట్టల మాదేశ్, సహాయ కార్యదర్శి ఈట నాగరాజు,కోశాధికారి జేరిపోతుల తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనం ఢీకొని వ్యక్తి మృతి



ప్రజాపక్షం/చందంపేట : నల్గొండ జిల్లా చందంపేట మండలం పోలేపల్లి నుండి నేరేడుగొమ్ము వెళ్లే ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నేరేడుగొమ్ము మండలానికి చెందిన ఎద్దు కిరణ్(29) హైదరాబాద్‌లో జొమాటో డెలివరీ బాయ్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి తన సొంత గ్రామమైన నేరేడుగొమ్ముకు వెళ్లే క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయంపై కిరణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నట్లు స్థానిక ఎస్ఐ సతీష్ తెలిపారు.